

# సరిహద్దు

సాయిబ్రహ్మానందం గొర్తి

ర వీ కెరీదా,

ఎలా వున్నారు? మా స్పానిష్ భాషలో కెరీదా అంటే ప్రియమైన అనర్థం. నాకు అమెరికాలో వున్న అతి కొద్దిమంది పరిచయస్తుల్లో 'ప్రియమైన' అని సంబోధించడానికి ఆలోచించనక్కర్లేని వ్యక్తి మీరు.

అమెరికాలో నేనంటూ గౌరవించే వ్యక్తుల్లో మీరు మొదట ఉంటారు. ఇంకా రాత్రి పది దాటినా ఆఫీసు పని చేస్తున్నారా? ఉద్యోగమూ, ఎదుగుదలా కోసం ఆరోగ్యాన్ని పణంగా పెట్టద్దు. ఇంతకీ మీకు 'పచ్చ కాగితం', అదేలెండి గ్రీన్‌కార్డ్ వచ్చిందా? మీకున్నా యనుకున్న సమస్యలు తీరాయా? అతి తక్కువ కాలంలో మీ కుటుంబంతో అనుబంధం ఏర్పడిపోయింది. ఇప్పుడు తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. మీరెవరో? నేనెవరో? కానీ ఇప్పుడు మీ గురించి నేను ఆలోచిస్తున్నాను. మీరూ నా గురించి ఆలోచించే ఉంటారు. చెప్పా పెట్టకుండా ఎలా అదృశ్యమయిపోయానా అని మీ కుటుంబం తప్పకుండా అనుకునే ఉంటారు.

అనూహ్యమైన పరిస్థితుల్లో చిక్కుకున్న నాకు గత రెండ్రోజులుగా మీరే గుర్తుకొస్తున్నారు. మీరు నాకు సాయం చేశారు. అది మర్చిపోలేదని చెప్పడానికీ, నేను చేసిన పొరపాట్లు చెప్పి, మిమ్మల్ని క్షమాపణలడగడానికే ఇది రాస్తున్నాను. పరిచయం అయ్యాక మీరేసిన మొదటి ప్రశ్నకి నా అబద్ధపు సమాధానంతో చెయ్యి కలిపాను. ఒక్కో అబద్ధాన్నీ కప్పిపుచ్చుతూ ఈ రెండేళ్లలోనూ పెద్ద గుట్టే తయారయ్యింది. దాన్ని వాస్తవమనే చిన్న మంటతో కాల్చి బూడిద చేయాలన్న చిన్న పశ్చాత్తాపం.

మొదటిసారి పరిచయంలో నేను ఏం చదువుకోలేదని అబద్ధం చెప్పాను. నేను సైన్స్‌లో డిగ్రీ పాస య్యాను. నాకూ మీలాగా ఇంగ్లీషు రాయడమూ, చదవడమూ వచ్చు. అన్నీ వచ్చి మీ ఆఫీసులో బాత్రూములు శుభ్రపరిచే ఉద్యోగం ఎందుకు చేస్తున్నానాని మీకు అనుమానం కలగచ్చు. చెప్పానుగా? అబద్ధంతో మొదలయిన స్నేహాన్ని ఒక నిజంతో ముగిద్దామన్న చిన్న ప్రయత్నం అంతే!

అందుకే నా జీవితాన్ని వివరించాలనే ఈ లేఖని రాస్తున్నాను. రాయాలా వద్దాని నాలో నేనే తర్జనభర్జన పడ్డాను. ఎప్పుడో ఒకప్పుడు మనసులో ఉన్నది బయటికి కక్కాలి. బాధయినా, సంతోషమైనా దాచుకుందామని ఎంత నొక్కిపెట్టినా ఒక్కోసారి వల్లకాదు. బంధువులూ, స్నేహితుల వద్ద మొహమాటానికో, చిన్నతనానికో మనసు విప్పి అన్నీ చెప్పం. ఇంటినీ, దేహాన్నీ, మనసునీ రోజూ శుభ్రపర్చుకోవాలని మా స్కూల్ టీచర్ చెప్పేవారు. మొదటి రెంటికీ కాస్తో, కూస్తో ప్రాధాన్యత ఇచ్చినా, మనసు దగ్గరకొచ్చేసరికి ఎందుకో విపరీతమైన బద్ధకం. నిర్లక్ష్యం కూడా. అప్పుడప్పుడు లిలియా దగ్గర మనసులో ఉన్నదంతా చెప్పడానికి ప్రయత్నించేవాణ్ణి. మధ్యలో లిలియా వేసే ప్రశ్నలకి చికాకొచ్చి మనసు దారి మళ్లేది. లిలియా అంటే నా ప్రేయసి. ఎంతో అమాయకంగా కళ్లు తిప్పుతూ కనిపించే ఆ స్వచ్ఛమైన రూపం అంటే నాకు చాలా ఇష్టం.

లిలియా నాకంటే అయిదేళ్లు చిన్నది. మొదటిసారి టెకోలుట్లా స్కూలు దగ్గర మా చెల్లికోసం వెళ్లి

నప్పుడు చూశాను. అలా ఆమెని చూడ్డం కోసం వారాల తరబడి వెళ్లేవాణ్ణి. చివరికి ఓరోజు మా చెల్లికి దొరికి పోయాను. ఇంట్లో చెప్పద్దని అయిదు పెసోలు లంచం ఇచ్చాను. తరువాత తెల్సింది, లిలియా మా చెల్లెలి సహ విద్యార్థిని. అలా మొదలయిన మా పరిచయం నేను డిగ్రీ పూర్తిచేసేవరకు సాగింది.

మా ఊరు టెకోలుట్లా. మెక్సికోకి పశ్చిమానున్న పోజారికా పట్టణానికి 45 మైళ్ల దూరంలో వున్న చిన్న పల్లెటూరు. మా నాన్న సముద్రంలో చేపలు పట్టేవాడు. అవి దగ్గర్లో ఉన్న ఒక రెస్టారెంట్‌కి అమ్మేవాడు. మా అమ్మ ఆ రెస్టారెంట్లో వంటపని చేసేది. 'ఫెలెతె ది పెస్కాడో రెలానో ది మరిస్కోస్' అనే చేపల కూర మిరప కాయలూ, వెల్లుల్లీ దట్టించి అద్భుతంగా వండేది. అది తినడానికే ఎంతోమంది ఆ రెస్టారెంటుకి వచ్చేవారు. నిజం చెప్పద్దూ ఏడాది పొడుగునా ఆ కూరొక్కటే తిన మన్నా దర్జాగా బ్రతికేస్తాను.

తనలా నేనూ కష్టపడకూడదని మా నాన్న నన్ను శాన్‌పాబ్లోలో కాలేజీలో చదివించాడు. లిలియాతో పరిచయం పెరిగినప్పట్నుండీ నా చదువు మందగిం చింది. లిలియా అమ్మానాన్న కూడా మావాళ్లల్లాగే చిన్న చిన్న పనులు చేసుకునే బ్రతుకు లాగిస్తారు. లిలియా మంచిపిల్ల. చాలా కలివిడిగా మాట్లాడుతుంది. చాలా సాయంకాలాలు మేం సముద్రం ఒడ్డున చాలాసార్లు గడిపాం. ఆమెతో కబుర్లలో పడితే కాలం తెలిసేది కాదు. చదువు పూర్తయ్యాక మా నాన్న నన్ను మెక్సికో సిటీలో తెలుసున్న బంధువు ఒకాయన ఉద్యోగం ఇప్పి స్తానంటే వెళ్లమన్నాడు. టెకోలుట్లా విడిచి వెళ్లడం అస్స లిష్టంలేదు నాకు. ముఖ్యంగా లిలియా గురించి. పోజా రికాలో ఏదోక ఉద్యోగం చూసుకుంటానని, వెళ్లనని మా నాన్నకి చెప్పాను. ఈ విషయం లిలియాతో చెబితే నన్ను తిట్టింది. మెక్సికో సిటీ వెళితే అక్కడి నుండి అమెరికా వెళ్లడానికి అవకాశాలొస్తాయని చెప్పింది.

ఎప్పటికయినా అమెరికా వెళ్లాలన్నదే తన ధ్యేయ మనీ లిలియా చెప్పింది. లిలియాకే కాదు మా వూళ్లో, ఆ మాటకొస్తే మా దేశంలో అందరికీ అమెరికా వెళ్లడమే గొప్ప జీవిత లక్ష్యం. మా దేశంలో నిరుద్యోగ సమస్య ఉంది. దాని నీడలోనే అవినీతీ పెరిగి పెద్దదయ్యింది. ప్రకృతినే నమ్ముకున్న మాలాంటి కుటుంబాలకి బ్రతకడం కష్టమే. సంపాదన తక్కువయిన ప్రజలు అంతగా ఖర్చు పెట్టరు. వారిమీదే బ్రతికే మాలాంటి వాళ్లకి కష్టమవుతుంది. మా దేశంలో లిలియాలా ఆలోచించే వాళ్లే అధికశాతం వున్నారు.

లిలియా మాట కాదనలేక మెక్సికో సిటీ వెళ్లాను. తెలుసున్న బంధువుల ద్వారా అమెరికా వెళ్లాలని నెల రోజులు తిరక్కుండా లిలియా మెక్సికో సిటీ వచ్చింది. అప్పుడొక ట్రావెల్ ఏజెంట్ పరిచయమయ్యాడు. మా దేశంలో వీళ్లని కయోటీ అంటారు. మనుషుల్ని పక్క దేశాలకు రవాణా చేసేవాళ్లని కయోటీ అని మెక్సికోలో అనడం కద్దు. ఆ కయోటీ మొత్తం రెండువేల అమెరికన్ డాలర్లు ఖర్చవుతుందని చెప్పాడు. అంత డబ్బు నా దగ్గరలేదు. అయిదేళ్లు పనిచేసినా అంత డబ్బు వెనకేయ లేను. లిలియా పోరు భరించలేక టెకోలుట్లా వెళ్లి నాన్నకి విషయం చెప్పాను. నాన్న సరేనని చెల్లెలి పెళ్లి కోసం దాచుకున్న డబ్బు ఇద్దామనుకున్నాడు. అమ్మ వద్దంది. ఓ రెండ్రోజులు మా ఇంట్లో యుద్ధం జరిగింది. చివరికి నాన్నే గెలిచాడు. అమెరికా వెళ్లగానే మొట్టమొదట ఆ రెండు వేలూ సంపాదించి అమ్మకి ఇవ్వాలని నిశ్చ యించుకున్నాను. బయల్దేరుతూండగా అమ్మ ఎరుపు నలుపూ తెలుపూ పూసలున్న చిన్న దండ నా మెడకి కట్టింది. ఏమిటో అనుకున్నాను కానీ అందర్నీ విడిచి వెళ్లడం అంత సులభం కాదని ఆ క్షణం అర్థమయ్యింది. అమ్మకీ నేను వెళ్లడం ఇష్టంలేదని గ్రహించాను. మొదట డబ్బు కోసం అనుకున్నాను. కానీ అది కాదన్న సంగతి తరువాత తెల్సింది. ఈ ప్రపంచంలో అమ్మలందరూ అంతే!

ఊరి నుండి తెచ్చిన సొమ్మంతా కయోటీ చేతిలో పోశాను. అమెరికా వెళ్లాలంటే పాస్‌పోర్టూ అవీ కావాలి కదా అని అప్లై చేద్దామని కయోటీని అడిగితే నన్ను చూసి నవ్వాడు. ఆ తరువాత తెల్సింది మా దేశం నుండి లీగల్‌గా ఎవరూ అమెరికా వెళ్లరని. చదువుకున్నవాళ్లతో సహా. మొదట నాకెందుకో భయం వేసింది. ఇప్పటికి వంద మందినిపైగా అమెరికా పంపానని లిస్టు చూపిం చాడు. పైగా లిలియా పోరు ఉండనే వుంది. మాకు మెక్సికో సిటీ నుండి అమెరికా బోర్డరు దగ్గరున్న శాండి యేగో నుండి అమెరికాకి పంపడానికి ఏర్పాట్లు చేశానని చెప్పాడు. కయోటీ మా వేషభాషల్ని మార్చాడు. లిలియాకి అమెరికన్లలాగ జుట్టుకి రంగేయించాడు. మేం గుర్తుపెట్టుకోవాల్సిన పేర్ల లిస్టొకటిచ్చి బట్టీ పట్ట మన్నాడు. ఎవరేం ప్రశ్నించినా తడబడకుండా సమా ధానం చెప్పమనీ, ఎక్కడా మొహంలో భయం కనిపించ నీయద్దనీ చెప్పాడు. అలా మేం అమెరికా బోర్డరు దగ్గరున్న టిహ్వానాకి విమానం ఎక్కి బయల్దేరాం. ఆ కయోటీ కూడా మాతో వచ్చాడు. చాలామంది మెక్సికన్లు

ఈ శాండీయేగో నుండే ఇల్లీగల్‌గా అమెరికాలో ప్రవేశిస్తారు. అమెరికా చేరాక ఎవర్ని కలవాలీ, ఏం చెయ్యాలీ అన్ని వివరాలు తీసుకొని ఒక కారులో నేనూ, లిలియా బయల్దేరాం. మాకు ఒక రెసిడెన్సీ కార్డొకటిచ్చాడు. దానిపైనున్న ఫోటోలో మా రూపాలు చాలా అస్పష్టంగా వున్నాయి. అది చూడగానే దొంగ కార్డని అర్థమయ్యింది. నాకెందుకో భయం వేసింది. ప్రాణాలు బిక్కుబిక్కుమంటూ బోర్డరు సమీపించాం. అక్కడొక అమెరికన్ అధికారి లిలియాని చూసి ప్రశ్నించాడు. కయోటీ చెప్పినట్లుగా శాండీయేగోలో ఉన్న బంధువుల్ని చూసి వారం రోజుల్లో వచ్చేస్తానని చెప్పింది. సరేనంటూ మమ్మల్ని కారు దింపి అక్కడున్న ఫింగర్ ప్రింటు మెషీన్ దగ్గరకి తీసుకెళ్లి వేలిముద్రలు తనిఖీ చేశాడు. వేలిముద్రలు సరిపోలేదంటూ ఆ మెషీన్ పైనున్న ఎర్రలైటు వెలిగింది. అంతే, నాకు కాళ్లాడలేదు. లిలియా మాత్రం ధైర్యంగానే వుంది. ఆ అధికారి మంచివాడులా వున్నాడు. మళ్లీ ఇంకోసారొస్తే జైల్లో వేస్తానని హెచ్చరించి మెక్సికోకి వెనక్కి పంపేశాడు. బ్రతుకుజీవుడా అనుకుంటూ ఇంటి ముఖం పట్టాం. ఈ వ్యవహారం బెడిసి కొట్టడంతో లిలియా కయోటీపై యుద్ధం చేసింది. మమ్మల్ని ఎలాగయినా అమెరికా పంపేలా చేస్తానని ఒప్పించి కాస్త ఓపిక పట్టమన్నాడు. బోర్డరు దగ్గర అధికారిని చూసి నాకు మొదట భయం కలిగినా, మమ్మల్ని వెనక్కి పంపించేసరికి పౌరుషం వచ్చింది. ఓడిపోయేకొద్దీ గెలవాలన్న తపనున్న వ్యసనపరుడిలా నాకు పట్టుదల పెరిగింది. ఆ విధంగా మా మొదటి ప్రయత్నం బెడిసికొట్టింది.

మళ్లా శాండియేగో అయితే దొరికిపోతామేమోనని ఈసారి కయోటీ అరిజోనా ఎడారి నుండి పంపుతానని చెప్పాడు. ఎడారంటే నాకు నచ్చలేదు. పైగా ఎంతో మంది ఆ ఎడారి సరిహద్దులు దాటుతూ, అక్కడ వేడి తట్టుకోలేక మరణించారని విన్నాను. వెళ్లడానికి నాకు భయం వేసింది. అస్సలు మనస్కరించలేదు.

మేం అరిజోనా ఎడారి సమీపంలో ఉన్న నోగాలె అనే ప్రాంతం నుండి అమెరికా సరిహద్దు దాటడానికి ఏర్పాట్లు చెయ్యడం మొదలుపెట్టాడు కయోటీ. నొగాలెలో ఉన్న మరొకతన్ని కలవమని చెప్పాడు. అక్కడ కయోటీని పొలెరో అని వ్యవహరిస్తున్నారు. ఎడారి వాతావరణం ఎలా వుంటుందీ, అధికారుల్నుండి ఎలా తప్పించుకోవాలీ, ఎలా సమాధానాలు చెప్పాలి అన్న విషయాలపై ట్రైనింగిచ్చారు. కొన్ని వీడియోలు అవీ చూపించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పారు. మా చేత అవన్నీ బట్టీ వేయించారు. సరిహద్దు దాటే వరకూ పొలెరో మాతోపాటు వస్తానన్నాక మాకూ ధైర్యం పెరిగింది. మొత్తం ఆరుగురున్నాం. ఈసారి ఏ వస్తువులు తీసుకెళ్లకూడదని హెచ్చరించారు. కట్టుబట్టలూ, కొన్ని డాలర్లూ తప్ప మా దగ్గరేమీ లేవు.

అమెరికా మోజులో పడి సరిహద్దు దాటడమే ఒక ధ్యేయంగా పెట్టుకున్నాం గానీ, అక్కడికెళ్లాక ఎలా బ్రతుకుతామన్న ఆలోచన మాకెవ్వరికీ రాలేదు. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే మేమందరమూ ఎంత గుడ్డిగా ప్రవర్తించామా అనిపిస్తుంది. అదంతే, మా తలరాత.

మేం వెళ్లేరోజు రాత్రి పది దాటాక ఒక వ్యానులో మమ్మల్నందర్నీ సరిహద్దు దగ్గర వదిలిపెట్టారు. రాత్రి పదకొండు దాటినా అక్కడ సెగలు కక్కే వేడిగాలి చూసి ఎలాగరా భగవంతుడా అనుకున్నాను. వేసవికాలం రాకుండానే బీభత్సమైన వేడి గాలి. ఎంత ఓ గంట ఓర్చుకుంటే చాలని ఒకళ్లకొకళ్లు ధైర్యం చెప్పుకున్నాం. ఇంతకుముందు మాకెవరికీ పరిచయం లేదు. ఈ రెండు గంటలూ కలిసి ప్రయాణిస్తాం. సరిహద్దు దాటగానే ఎవరి దారి వారిదే! రాత్రి ఒంటిగంట దాటాక మేం ఆ ఎడారిలో నడక ప్రారంభించాం. ఆ వేడికి గొంతు పిడచ కట్టుకుపోయింది. అలాగే ఓర్చుకుంటూ నడవసాగాం. ఈ అరిజోనా ఎడారి విచిత్రమైంది. చుట్టూ ఎత్తైన కొండ ప్రదేశం. బొమ్మజెముళ్లు, ముళ్లపొదలు, తుమ్మమొక్కలు తుప్పలు తుప్పలుగా వుంటాయి. వాటి మధ్య పాములు, విషపూరితమైన తొండలు, ఎడారి తేళ్లు వుంటాయని ముందు జాగ్రత్తల్లో ఒకటికి పదిసార్లు చెప్పారు. మిగతా అయిదుగురూ ఉన్నామన్న ధైర్యం తప్పిస్తే ఒంటరిగా ఏ మానవమాత్రుడూ నడక సాగించలేడు. ఎవరెవరితోనూ గట్టిగా మాట్లాడ్డాని క్కూడా వీల్లేదు. మా మాటలు వింటే రాత్రి గస్తీ కాచే అమెరికన్ అధికారులకెక్కడ చిక్కుతామోనన్న భయం కూడా వుంది.

దాదాపు రెండు గంటలు నడిచాక అందరం ఒక చోట విశ్రాంతికి చతికిలబడ్డాం. ఇంకొక్క అరగంటలో సరిహద్దు చేరుకుంటామని పొలెరో చెప్పాడు. లేని ఓపిక తెచ్చుకొని మెల్లగా అడుగులు వేసుకుంటూ బయల్దేరాం. కొంత దూరంలో చిన్న రహదారి కనిపించింది. దాని వెంబడే వెళ్లబోతూండగా హఠాత్తుగా మా కంట్లో కాంతి పడింది. అందరమూ తలో మూలకీ పరిగెత్తాం. పొలెరో, నేనూ దగ్గర్లో వున్న చెట్టు వెనక్కి పరిగెత్తాం.

పరిగెత్తే కంగారులో అక్కడ పడిపోయింది లిలియా. హఠాత్తుగా ఒక జీపొచ్చి ఆగింది. మా కళ్లెదుటే లిలియా పట్టుబడింది. నేను లిలియాని రక్షిద్దామని ముందుకెళ్ల బోతే పొలెరో నన్ను ఆపాడు. ఆ అధికారులు లిలియాని ప్రశ్నించడం చూశాను. లిలియా గట్టిగా ఏడవటం విని పించింది. ఆమెనొక్కతినీ విడవడానికి మనసెందుకో ఒప్పలేదు. పొలెరో వద్దన్నా నేనూ చెట్టు చాటు నుండి పరిగెత్తుకుంటూ జీపు దగ్గరకెళ్లాను. నన్ను చూసి కంగారుగా ఆ అధికారులిద్దరూ మాకేసి తుపాకీ గురి పెట్టారు. చేతులెత్తి మేమిద్దరం లొంగిపోయాం. మమ్మల్ని జీపెక్కించారు. వెళుతూండగా నా తోటివాళ్ల కోసం వెనక్కి చూశాను. దూరంగా పరిగెడుతూ పొలెరో కనిపించాడు. నన్ను చూసి బావురుమంది లిలియా. నేనున్నానని ధైర్యం చెప్పాను.

మమ్మల్ని నొగాలె సరిహద్దు గేటు వద్దకి తీసుకెళ్లి ఇంటరాగేషన్ మొదలు పెట్టారు. నా గురించి చెబు తున్నంతసేపూ అందులో ఒకతను లిలియాకేసే చూస్తూ ఉన్నాడు. మధ్యలో లిలియాని తీసుకొని వేరే జీపె క్కించుకొని వెళ్లిపోయాడు. కళ్లల్లో కన్నీరు కారుతుండగా నా ప్రేయసి నన్నొదిలిపోతూ కనిపించింది. జీవితంలో సంతోషంగా జీవించడానికి అమెరికా వెళదామనుకున్న మేం ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో చిక్కుకుంటామని కలలో కూడా ఊహించలేదు. అదే నేను లిలియాని ఆఖరుసారి చూడ్డం. ఆ మర్నాడు నన్ను జీపులో తీసుకెళ్లి మెక్సికన్ బోర్డరు వైపు దింపారు. దారి పొడుగునా లిలియా గురించి అడిగాను. ఎవరూ చెప్పలేదు. వాళ్లం దరికీ స్పానిష్ భాషొచ్చు. అయినా నేను మాట్లాడేది అర్థంకానట్టే ఉన్నారు. ఏడుపొచ్చింది. లిలియా కోసం మనసు రోదించింది.

ఇదంతా మామూలేననీ వారంలోగా మరలా పంపుతానని నాతో పొలెరో అన్నా, నాకు అమెరికా మీద వ్యామోహం పోయింది. నాకు లిలియా దక్కితే చాలు. టోర్టియా (చపాతీ లాంటిది) తినయినా మెక్సికోలోనే బ్రతుకుదామనిపించింది. ఏం? ఎంతమంది మా దేశంలో బ్రతకడం లేదు? మేమూ వాళ్లల్లో ఒకళ్లుగానే జీవిస్తాం. అంతే! లిలియా కోసం రోజూ నొగాలె సరిహద్దు దగ్గరకొచ్చేవాణ్ణి. అక్కడున్న మెక్సికన్ అధికారుల్ని లిలియా గుర్తులు చెప్పి అడిగేవాణ్ణి. లిలియా జాడ మాత్రం లేదు. అమెరికన్ అధికార్లు చంపేసారా అని భయపడ్డాను. ఎందుకంటే ఏటా ఇలా సరిహద్దులు దాటుతూ వందలమంది చనిపోయారని విన్నాను. అందులో అన్ని చావులూ ఎడారి వేడికి కాకపోయినా కొన్నయినా అమెరికన్ తుపాకులకి బలైనవేననీ తెలుసు. ఎన్నో రాత్రుళ్లు లిలియా కోసం ఏడ్చాను. అమ్మ ప్రతీ ఆదివారం చర్చికి రమ్మనమంటే వెళ్లడానికి ఇష్ట పడని నేను లిలియా క్షేమంగా ఉండాలని దేవుణ్ణి కోరు కున్నాను. లిలియా గురించి వెతకడం వృథా అనీ, అమెరికన్ అధికారులు ఆమెని జైల్లో వేసుంటారని పొలెరో చెప్పాడు. నాకెందుకో తిరిగొస్తుందన్న నమ్మకం ఉండేది. ఏ రోజైనా లిలియా వస్తుందన్న ఆశతో అక్కడ రెండు వారాలు గడిపాను.

సాధారణంగా పట్టుబడిన స్త్రీలని అమెరికన్ అధికారులు కొంతమంది అనుభవించి వాళ్లని మెక్సికో సరిహద్దు పోస్టు దగ్గర వదిలేస్తారు. అమెరికాలోనే క్షేమంగా ఉండుండాలి. మా ఇంట్లో కానీ, లిలియా ఇంట్లో కానీ ఎవరికీ ఈ విషయం కబురంపలేదు. నాకే మొహం చెల్లలేదు. అలా పిచ్చివాడిలా అక్కడే నొగాలే దగ్గరే రెణ్ణెల్లు గడిపాను. తెచ్చుకున్న సొమ్మంతా అయి పోసాగింది. నన్ను చూసి పొలెరో జాలిపడ్డాడు. లిలియా అమెరికాలో బ్రతికే ఉందన్న నమ్మకం కలిగించి, నన్ను ఎలాగయినా అమెరికా పంపుతానని మాటిచ్చాడు. వెళ్లడానికి నేనూ సిద్ధపడ్డాను.

ఈసారి ఎంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశాడు పొలెరో. ఒక నకిలీ అమెరికన్ పాస్‌పోర్టు పుట్టించాడు. నా జుట్టుకి ఎర్రరంగు వేయించాడు. ఎవరికీ అను మానం రాకుండా వంటి మీదున్న జుట్టుకీ రంగు వేసు కోమన్నాడు. నేను అలాగే చేశాను. చూడగానే ఏమాత్రం అనుమానం రాకుండా నా రూపం మార్పించాడు. వెళ్లే ముందు లిలియా ఫోటో ఒకటి పొలెరోకి ఇచ్చాను. ఈ రెణ్ణెల్లలోనూ నన్ను పట్టించుకున్నదెవరయినా ఉంటే ఈ పొలెరోనే. నాకు ఉండడానికి మకాం చూపించాడు. కష్టమూ, సుఖమూ చెప్పుకున్నాడు.

నాకు ఇంగ్లీషు రావడం ఈసారి చాలా ఉపయోగ పడింది. పట్టుబడితే పట్టుబడ్డానన్న మొండి ధైర్యంతో నేనూ మానసికంగా తయారయ్యాను. చిత్రం, ఈసారి బోర్డరు వద్ద నన్నెవరూ అంతగా ప్రశ్నించలేదు. మొదటి రెండుసార్లూ అష్టకష్టాలూ పడ్డ నేను మూడోసారి మాత్రం ఎంతో సులభంగా అమెరికా వచ్చేశాను. బోర్డరు దాట గానే టస్కన్ వెళ్లి పొలెరో కలవమని చెప్పినతన్ని కలి శాను. లిలియా గురించి చెప్పి ఆమె ఫోటో ఒకటి కాపీ ఇచ్చాను. నన్ను మాత్రం నొగాలే సమీపంలో ఉండొద్దనీ చెప్పాడు. వీలయితే కొద్దిరోజుల్లో కాలిఫోర్నియా పంపిస్తా

నని చెప్పాడు. నాకు ఎప్పటికైనా లిలియా కనిపిస్తుం దేమోనన్న ఆశ. ఎక్కడికెళ్లినా లిలియా కోసమే నా కళ్లు వెతికేవి. రోజులు గడిచేకొద్దీ లిలియాపై ఆశ సన్న గిల్లింది.

కొంతకాలమయ్యాక నేను శాన్‌హోసె వచ్చాను. ఆ విధంగా మీతో పరిచయమయ్యింది. అదే ఈ ఉత్తరం రాయించే స్థితికి తీసుకొచ్చింది. నాకు అమెరికా లో మిత్రులెవరూ లేరు, మీరు తప్ప.

మొదటిసారి మిమ్మల్ని చూసినప్పుడు మీరూ మాలాగే వచ్చారని అనుకున్నాను. ఇండియా అన్న ఒక దేశం ఉందని తెలుసు తప్ప, నాకు దాని గురించి అంతగా అవగాహన లేదు. స్కూల్లో ఎప్పుడో గాంధీ గురించి చదివాను. ఆయనది ఇండియా అని మాత్రమే తెలుసు. అమెరికా ఒక భూతలస్వర్గం. ఎంతోమంది వివిధ దేశాల్నుండీ వచ్చి స్థిరపడుతున్నారని ఇక్కడి కొచ్చాక తెలిసింది. కంప్యూటర్ యుగంలో ఇండియా కూడా ముందుకెళుతోందని మిమ్మల్నందర్నీ చూశాక అర్థమయ్యింది. మీరందరూ మాలా కాకుండా చట్ట బద్ధంగా ఈ దేశం వచ్చినవాళ్లు. కాబట్టి మీకు మేం పడ్డ కష్టాలు తెలీవు. తెలిసే అవకాశం కూడా లేదు. ఎందు కంటే మా కథలు ఎవరికీ చెప్పం. ఏ పేపర్లోనూ ఎవరూ ప్రచురించరు. ప్రచురిస్తే మాకే ఇబ్బంది. అందుకని మేమూ మా జాగ్రత్తలో ఉంటాం. నాలా ఇల్లీగల్‌గా వచ్చినవాళ్లు ఈ కాలిఫోర్నియాలోనే లక్షలమందున్నారు. వచ్చిన కొత్తలో ఇంతమంది ఎలా బ్రతుకుతున్నారాని ఆశ్చర్యపోయేవాణ్ణి. ఎందుకంటే సోషల్ సెక్యూరిటీ నంబరు లేనిదే ఎవరూ ఇక్కడ ఉద్యోగం ఇవ్వరు. అదీ గాక ఉద్యోగం ఇచ్చినవాళ్లు వారిచ్చే జీతం నుండే దేశానికి కట్టాల్సిన పన్ను విరగ్గోసి మరీ ఇస్తారు.

అందువల్ల మాలాంటి వాళ్లు ఇక్కడ ఉద్యోగా లకి ప్రయత్నం చేస్తే చట్టానికి దొరికిపోతాం. అమెరికా వచ్చిన కొత్తలో చాలా ఇబ్బందులే పడ్డాను. రాగానే సుస్తీ చేసింది. లిలియా దూరమయ్యిందన్న బాధ, ఇక్కడెలా బ్రతుకుతామురా అన్న బెంగా రెండూ నా ఆరోగ్యంపై దెబ్బకొట్టాయి. ఉద్యోగాలకొచ్చే చిక్కే డాక్టర్ల వద్దా ఎదు రవుతుంది. నాకు హెల్త్ ఇన్సూరెన్స్ లేదు. అందువల్ల చిన్న దుకాణాల్లో దొరికే మందులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక్కడికొచ్చాక కానీ ఈ దేశం గురించి అర్థం కాలేదు. మరీ చిన్నచిన్న పనులు చెయ్యడానికి మనస్క రించలేదు. ఇక్కడున్న ఏజెంటు అలాటి ఉద్యోగాలే తప్ప వేరే గత్యంతరం లేదని చెప్పాడు. వచ్చిన కొత్తల్లో హోం డిపో దగ్గర కూలీపనుల కోసం ఎదురుచూస్తూ ఉండేవాణ్ణి. మొదట్లో ఇదొక్కటే డబ్బు సంపాదించ డానికి సులభమార్గం అని మా వాళ్లందరూ చెప్పారు. పైగా పనయ్యాక మేం క్యాష్ మాత్రమే తీసుకుంటాం. చెక్కుల్లాంటివి తీసుకోడం మాకే ముప్పని మా అందరి బుర్రల్లోనూ బాగా దట్టించారు.

ఎవరికయినా గార్డెన్ పని చెయ్యాలన్నా, బరువు పనులు చెయ్యాలన్నా ఒప్పుకునేవాణ్ణి. టెకోలుట్లాలో ఉండగా అమ్మానాన్నలకెప్పుడూ సాయపడిన గుర్తే లేదు. నాన్నకెప్పుడూ నా చదువు గోలే! ఎప్పుడైనా అమ్మ చిన్నచిన్న పనులు చెబితే విసుక్కునేవాడు. అలా సోమరిగా బ్రతికిన నేను ఇక్కడికొచ్చాక కూడని పనులు చెయ్యడానికి సిద్ధపడుతున్నానంటే నాకే ఆశ్చర్యం కలుగుతోంది. కొన్నాళ్లు చాలా మోటు పనులు చేశాక ఓపిక లేక నావల్ల కాదనిపించింది. ఇక్కడ వర్క్ పర్మిట్టు దొరకడం అంత సులభం కాదని చాలా లేటుగా తెలి సింది. గత్యంతరం లేక మా ఏజంటుకున్న 'జానిటర్' పనులు చేసే కంపెనీలో పనిచెయ్యడానికి ఒప్పుకోక తప్పలేదు. అతను నాకు వర్క్‌పర్మిట్‌కి అప్లై చేస్తానని నన్ను ఒప్పించాడు. గతి లేక సరేనన్నాను. పైగా అది సాయంత్రం ఏడు దాటాక పని. మిగతా పనులతో పోలిస్తే శారీరక శ్రమ అంతగా ఉండదు. ఆ విధంగా నేను మీ కంపెనీలో బాత్రూములు శుభ్రపరిచే ఉద్యో గానికి వచ్చేవాణ్ణి.

మిమ్మల్నందర్నీ చూస్తున్నంతసేపూ నాకూ మీలాగ ఒక ఆఫీసులో కూర్చొని పని చెయ్యాలని పించేది. అలా కలలు కనే మా అమ్మానాన్న నన్ను చది వించారు. వారి కలలకు భిన్నంగా నేను చేస్తున్న ఈ పనులు తెలిస్తే వాళ్లు తట్టుకోలేరు. ముఖ్యంగా మా అమ్మ. ఏమీ చెయ్యలేని పరిస్థితి. తిరిగి మా దేశం వెళ్ల లేను. వెళ్లడం జరిగితే లిలియాతోనే వెళతాను. ఆమె ఎప్పటికయినా కనిపించకపోతుందా అన్న ఆశ ఉండేది. ఆమె ఫోటో మా స్పానిష్ కమ్యూనిటీలో అందరికీ పంచాను. చూస్తుండగా ఏడాది గడిచిపోయింది. నా బ్రతుకులో ఏమాత్రం మార్పులేదు. అమెరికా వచ్చాక అమ్మానాన్నలకి ఉత్తరం రాశాను. లిలియా ఇంటికీ నేను ఉత్తరం రాసి లిలియా సంతకం పెట్టాను. ఈ విధంగా లిలియా తల్లిదండ్రుల్నీ మోసం చేశాను. నా తల్లిదండ్రులకి నేనెలా అమెరికా వచ్చిపడిందీ తెలీదు. ఎవరికీ ఎప్పుడూ చెప్పలేదు.

ఈ కాలిఫోర్నియాలో ఉన్న లాటినో కమ్యూనిటీ అంతా నా బాపతుగాళ్లే. మమ్మల్నందర్నీ లీగల్ చేసి ఇక్కడ జనస్రవంతిలో కలపమన్న ఒక రాజకీయ అంశం కూడా ఉందని తరువాత తెల్సింది. ఎంతయినా మీరూ, నేనూ అందరం వలసొచ్చినవాళ్లమే! ఇక్కడి న్యాయాలూ, చట్టాలూ ఈ దేశస్థుల కనుగుణంగానే ఉంటాయి. ఈ దేశమనే కాదు, ఏ దేశమయినా అంతే! ఓసారి క్లింటనొస్తున్నాడనీ, ఆ సందర్భంగా లాటిన్ అమెరికా నుండొచ్చిన వాళ్లందరూ వాళ్లకి ఈ దేశపు పౌరసత్వం కోసం చేసే ధర్నాకి నేను వెళుతున్నానంటే మీరొక ప్రశ్న లేవనెత్తారు. నాకింకా గుర్తు. 'ఇక్కడ లా అండ్ ఆర్డరు ఎంతో గొప్పగా ఉంటాయికదా? వీళ్లు తలుచుకుంటే ఇల్లీగల్‌గా వచ్చిన వాళ్లని ఏరెయ్యడం కష్టమయిన పనికాదే? మరెందుకు చూసీ చూడనట్లుంటారు?' అంటూ ప్రశ్నించారు. చటుక్కున నాకు సమాధానం తట్టలేదు. ఎవర్నడిగినా తెలీదన్నారు. ఇదే విషయం నేనొక స్పానిష్ న్యాయవాదితో అంటే, 'అమెరిన్లు చాలా తెలివైనవాళ్లు. మిమ్మల్నందర్నీ మీ దేశాలకి పంపించేస్తే ఈ దేశంలో వీళ్లు చెయ్యలేని పనులెవరు చేస్తారు? బాత్రూములు కడగడానికీ, ఇల్లు శుభ్రపర్చే పనులకీ, బండ పనులు చేయడానికీ వీళ్లకి మనుషులు కావాలి. అందుకని మీరందరూ దొంగతనంగా వచ్చినా మిమ్మల్నెవరూ ఏమీ చెయ్యరు. అంతేకాదు, మీ హక్కుల కోసం రాజకీయ నాయకులు మరింత పోరాటం చేస్తారు. ప్రజాస్వామ్య భ్రమణానికి ఓటే కదా గరిమనాభి. కాబట్టి మీరు వీళ్లకి కావాలి. మీకూ ఇక్కడ బ్రతకడం కావాలి. ఇద్దరిదీ విన్-విన్ సిట్యుయేషన్,' అంటూ చక్కగా చెప్పాడు. ఆ మాటల్లో అంతర్లీన సత్యం దాగుంది కదా?

మొదట్లో మిమ్మల్నందర్నీ చూసి వర్క్ పర్మిట్ వీసాలతో బాగానే వచ్చారనుకునేవాణ్ణి. మా అంత కాకపోయినా మీకూ అమెరికాలో కష్టాలున్నాయన్న సంగతి మీతో పరిచయమయ్యాకే తెలిసింది. పని చేయడానికి వీసా ఉందని తెలిసీ మిమ్మల్ని పావులుగా వాడుకుంటారన్న సంగతి తెలియదు. గ్రీన్‌కార్డొచ్చే వరకూ మీకూ స్వేచ్ఛ లేదు. ఈ అమెరికా అన్నదొక మాయాజాలం. వచ్చేవరకూ రావడమే ధ్యేయమనుకుంటాం. తీరా వచ్చాక ఇక్కడెలా స్థిరపడాలన్న ఆలోచన బయల్దేరుతుంది. వయసులో వున్న కుర్రాడు అందమైన అమ్మాయి మోహంలో పడ్డట్టు అందరూ ఈ దేశపు మాయలో పడిపోతారు. మాలా మీకు దినదిన గండం కాదు. మాకయితే బ్రతుకంతా ఇల్లీగల్ వ్యవహారమే! కొంతమంది ఇక్కడే ఉన్న లాటినోలని పెళ్లాడి వారి ద్వారా పౌరసత్వం సంపాదిస్తారు. చట్టాలెన్నున్నాయో అంతకుమించి లొసుగులూ ఉంటాయి. మాకు అక్కడున్న లాటినో లాయరు సాయం చేస్తాడు. ఆయనకి ఎలా మమ్మల్ని లీగల్‌గా మార్చాలో తెలుసు. అంతవరకూ నాలాంటి వాళ్లు చిన్నచిన్న పనులు చేసుకుంటూ గడపాల్సిందే! ఈ చీకటి బ్రతుకులకి వెలుగెప్పుడొస్తుందో? ఓపికొక్కటే మాకున్న ఆయుధం.

ఎక్కడో మొదలుపెట్టి ఇలా నా అభిప్రాయాల చెత్తంతా రాసేస్తున్నానను కోకండి. మనసుకనిపించింది రాసేస్తున్నానంతే! మీతో చెప్పాపెట్టకుండా మాయమవడం నే చేసిన వెధవ పనని నాకు తెలుసు. ఏం చెయ్యమంటారు? లిలియా కనిపించిందని నాకు పొలెరో కబురంపాడు. లిలియాని చూసి మూడేళ్లయిపోతోంది. మీకు తెలీదు లిలియా కోసం ఇన్నాళ్లూ ఎంత తపించానో! బహుశా ఆమె కూడా నాలాగే తపిస్తూ ఉండి ఉంటుంది. ఎక్కడని వెతికేది చెప్పండి? రోజులు గడిచిపోతున్నాయి. డాలర్లు సంపాదించాను కానీ బ్రతుకులో సంతృప్తి లేదు.

ఇన్నాళ్లూ నాకున్నవి రెండే కోర్కెలు. లిలియా వళ్లో తల పెట్టుకొని హాయిగా నిద్రపోవడం, వెల్లుల్లీ ఎర్రటి మిరపకాయలు దట్టించిన అమ్మ చేతి వంట తినడం. ఇంతకుమించి నాకేమీ అక్కర్లేదు. యంత్రంలా గడిచిపోతున్న జీవితంలో మరలా లిలియా గురించి విన్నాను. అందుకే ఉన్న పళాన ఎవరికీ చెప్పకుండా పరిగెత్తాను. చెబితే మరలా నా లిలియా చేజారిపోతుందేమోనన్న భయం. పొలెరోకి టస్కన్‌లో కనిపించిందని చెప్పాడు. ఎక్కడుందీ, మాట్లాడావా, ఎలా వుందీ ఇవేమీ అడగలేదు నేను. లిలియాను తక్షణం పట్టుకోవాలి. మా ఏజెంటుకి రెండు వారాలు సెలవు కావాలని కబురంపాను. ఎందుకో, ఏమిటో చెప్పలేదు. ఏమయిపోయానా అని అతను బహుశా కంగారుపడుంటాడు. మీరయితే ఎదురుచూస్తూ ఉండుంటారు. ఏమీ కాలేదండీ! ఇంకా బ్రతికే ఉన్నాను. ఇక్కడ అరిజోనా జైల్లో గత నాలుగు నెలలుగా పడున్నాను.

తల్చుకుంటేనే ఏడుపొస్తోంది. ఎవరినీ సంప్రదించలేని పరిస్థితి. ఎన్ని రాత్రులు నిద్రలేకుండా గడిపానో తెలీదు. ఒక్కోసారి నన్ను నేనే తిట్టుకునేవాణ్ణి. ఇంకోసారి లిలియాతో పరిచయమయ్యాకే నాకు సుఖం శాంతీ లేకుండా పోయాయని రోదించేవాణ్ణి. వెంటనే

పాపం ఇందులో లిలియా తప్పేముంది? ఆమె కూడా నాలా విధి వంచితే కదానిపించేది.

వారం క్రితం రాత్రి గుండెనొప్పి వచ్చి కూలబడి పోయాను. పక్క సెల్‌వాళ్లు నేను విలవిల్లాడడం చూసి గట్టిగా అరిచారు. కళ్లు తెరిచేసరికి ఆసుపత్రి మంచమ్మీ దున్నాను. రెండ్రోజుల తర్వాత స్పృహలోకి వచ్చానని తెలిసి ఆశ్చర్యపోయాను. నాకు చిన్నగా హార్టెటాకొచ్చిం దని చెప్పారు. వెంటనే మీరు గుర్తుకొచ్చారు. మీరు కూడా రాత్రింబవళ్లు పని ఒత్తిడిలో ఎంత టెన్షన్ అనుభ వించారో గుర్తుకొచ్చింది. రోజూ మీ కంపెనీలో బాత్రూములు శుభ్రపరచడానికి ఏడింటికి వచ్చేవాణ్ణి. పనంతా అయ్యేసరికి రాత్రి పదకొండు దాటేది. మీరు ఏ రోజు పన్నెండు ముందుగా వెళ్లడం చూళ్లేదు. మీరు పరిచయం లేకపోయినా ఏవిటీ మనిషిలా పని చేస్తా డనుకునేవాణ్ణి. చాలాసార్లు పెళ్లాం పిల్లలు లేరాను కున్నాను. పని ఒత్తిడిలో మీరొకరోజు పడిపోతే నేను 911కి ఫోన్ చేసి మిమ్మల్ని రక్షించడంతో మీకు నేనెవరో పరిచయమయ్యింది. ఆ తరువాత మీ కుటుంబమూ మీరూ నన్ను ఆదరించారు. ఒకసారి నాకు యాక్సిడెం టయ్యి చెయ్యి విరిగితే నాకు ఇన్సూరెన్స్ లేదని మీకు తెలుసున్న వారి ద్వారా వైద్యం చేయించారు. ఆ ఖర్చంతా మీరే భరించారు. మీరివన్నీ చేసింది నేను మిమ్మల్ని ఆసుపత్రి తీసుకెళ్లిన సహాయానికే! నా గురించి మొదట్లో మీకు అన్నీ అబద్ధాలే చెప్పాను. అవన్నీ కావాలని చెప్పినవి కావు. గత్యంతరం లేక చెప్పాను. ఎప్పటికప్పుడు చెబుదామనుకున్నా కుదర్లేదు. మీరు నాకు చాలా సాయాలు చేశారు. మీకు తెలీ కుండా మీ వాలెట్ నుండి అవసరాలకి డబ్బు దొంగిలిం చాను. నేనే ఇలా... ఇదంతా రాస్తున్నానంటే ఏడుపొ స్తోంది. అమ్మ గుర్తుకొస్తోంది. లిలియా పక్కనుంటే బావుణ్ణనిపిస్తోంది. హేవియర్ డిన్నరుకి రా అని పిలవడం గుర్తుకొస్తోంది.

ఎంత ఏడ్చి ఏం ప్రయోజనం? మీరెవరూ నన్ను కలవలేరు. నన్నెప్పుడు ఈ జైలు నుండి రిలీజు చేస్తారో తెలీదు.

పాలెరో లిలియాని చూశానని కబురంపగానే టస్కన్ వెళ్లాను. పాలెరో ఆమెను ఒక గ్రోసరీ స్టోరు దగ్గర కార్లో వెళుతూ చూశానని చెప్పాడు. ఎక్కడో చూసినట్లు గా ఉందనుకొని పర్సులో దాచుకొన్న నేనిచ్చిన లిలియా ఫోటో బయటకు తీసి చూశాడట. అచ్చం అలాగే ఉందని కారు రివర్సు చేసి వెళ్లాడట. కారు పార్కు చేస్తుండగా లిలియా కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లడం చూశానని చెప్పాడు. ఆమెకేసి చూస్తే తనని గుర్తు పట్టి నట్లు ఆమె కళ్లల్లో కాంతి కనిపించిందనీ చెప్పాడు. పలకరించే లోపలే అక్కడినుండి వెళ్లిపోయిందని అన్నాడు.

నేనూ పాలెరో లిలియా కోసం చుట్టుపక్కలంతా గాలించాం. నాతోపాటు తనూ వెతికాడు. ఓరోజు పాలెరో స్నేహితుడొకడు ఒకరింట్లో పని చెయ్యడానికి వెళితే అక్కడ లిలియా పేరుగల ఒకామెను చూశాడని చెప్పాడు. అంతే, నేనూ పాలెరో స్నేహితుడూ ఆ ఇంటి ముందు కాపు కాశాం, ఎప్పుడైనా బయటి కొచ్చినప్పుడు కనిపించకపోతుందాని. ఆ రాత్రి పాలెరో రాలేదు. ఆ ఇంటి ముందు కార్లోనే నిద్రపోయాం.

ఓరాత్రి వేళ ఇద్దరు పోలీసులు కారు డోరు తట్టడంతో నిద్ర లేచాం. మమ్మల్ని అరెస్టు చేసి జైలుకి తీసుకెళ్లారు. అక్కడికెళ్లాక తెలిసింది, పాలెరో స్నేహితుడొక డ్రగ్ ట్రాఫికింగ్ ఏజెంటని. ఆ కార్లో వాళ్లకి గంజాయి పేకెట్లు ఇంకా ఆయుధాలు దొరికాయని చెప్పి మమ్మల్నిద్దర్నీ అరెస్టు చేశారు. నా వివరాలన్నీ కూపీ లాగారు. నా గురించి అంతా చెప్పాను. ఎవరూ నమ్మలేదు. నిజం చెబుతున్నా అబద్ధాలు చెబుతున్నా వాని ఎద్దేవా చేశారు. ఈలోగా నాకు గుండెనొప్పి వచ్చి ఆసుపత్రి పాలయ్యాను. బ్రతుకుతానో లేదో తెలీదు. మీరొక్కసారి రాగలరా? నాకంటూ ఈ దేశంలో ఉన్నది మీరొక్కరే! నా బాధ చూసి జైలు అధికారి ఉత్తరం రాసు కోడానికి అనుమతిచ్చాడు. సాధారణంగా మా ఉత్తరాలు చూసి ఆమోదించిన తరువాతే పోస్టు చేస్తారు. ఈసారి ఆ జైలు అధికారి ఎందుకో చదవలేదు. చదివినా నేను పట్టించుకోదల్చుకోలేదు. ఏం చేస్తారు? చించేస్తారు, అంతేగా! బ్రతుకే చిందరవందరయ్యింది. దాని ముందిది లెక్కా?

నిన్ననే మా తరఫున వాదించే అటార్నీ వచ్చాడు. మీరొక్కరే నన్ను ఈ ఊబి నుండి పైకి లాగగలరని చెప్పాడు. మీ దగ్గర దాచుకున్న నాకు సంబంధించిన పత్రాలు కావాలి. నే చేసిన తప్పులన్నీ క్షమించి మీరొక్క సారి రండి. ఇంకెప్పుడూ అబద్ధం చెప్పనని ప్రామిస్ చేస్తున్నాను.

నిన్న ఆసుపత్రిలో ఉండగా ఒక విచిత్రం జరిగింది. నన్ను టెస్టులకని వీల్‌ఛైర్లో వేరే రూంకి తీసుకెళుతూండగా చేతిలో చిన్నపిల్లని ఎత్తుకొని తీసుకెళుతూ కనిపించింది.

నేనామెను చూసి ఒక్కసారి ఉలిక్కి పడ్డాను. లిలియాలా అనిపించి కళ్లు నులుపుకొని మరీ చూశాను. ఆమె ఖచ్చితంగా లిలియానే!

నోట మాట రాలేదు. మూడేళ్ల నిరీక్షణా ఒక్కసారి చచ్చుబడిపోయింది.

ఆమె నన్ను గమనించలేదు. నేనామెను పిలవలేదు.

ఇప్పుడు ఆమె వళ్లో తలవాల్చాలనీ లేదు. అంతెందుకూ ఈ దేశంలోనే వుండాలని లేదు.

మా వూరెళ్లి అమ్మ చేసిన 'ఫెలెతె ది పెస్కాదో రెలానో ది మరిస్కోస్' తినాలనుంది.

నా మెళ్లో వేసిన పూలదండని అమ్మ మెళ్లో వేయాలనుంది.

అదే నా చివరి కోరిక.

హాస్తా ప్రాంతో,
-హేవియర్

---

1. కెరీదా- ప్రియమైన
2. పెసో- మెక్సికన్ డబ్బు
3. ఫెలెతె ది పెస్కాదో రెలానో ది మరిస్కోస్- మెక్సికన్ చేపల కూర
4. కయోటీ- మెక్సికన్లని అమెరికాకి పంపే దళారి
5. పొలెరో- మెక్సికో సరిహద్దు దాటాక అమెరికాలో ఉండే ఇల్లీగల్ దళారులు
6. టోర్టియా- చపాతి
7. హాస్తా ప్రాంతో- త్వరలో కలుద్దాం

*సాక్షి ఫన్ డే, 6 ఫిబ్రవరి 2011*

